
వైపాలెం: గాయత్రి సింగ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం రమాదేవి


ఆదర్శ పాఠశాలలో టాపర్లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


పెద్దారవీడు: దేవరాజుగట్టు విద్యార్థిని పూజిత (579)ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


కురిచేడు: మండల టాపర్‌గా నిలిచిన వేమా అశ్విని


గణపవరం విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి

# పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా


శ్యామ్ శివ విష్ణు వర్ధన్‌రెడ్డి (570)


పత్తి భవాని (573)


పి.అశ్విని (583)


బి.కీర్తన (583)


కె.బాలకృష్ణ (580)


కందేల షాలిని (583)


గాజుల ఆదిలక్ష్మి (592)


కృష్ణంశెట్టి గీతానాగేశ్వరి (576)


దారం రాఘవేంద్ర రెడ్డి (586)


షేక్ బషీర్ (588)

**పెద్దదోర్నాల:** పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. పెద్దదోర్నాల మండల వ్యాప్తంగా 584 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 90 శాతంతో 503 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ బషీర్ 588 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు 157 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దబొమ్మలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 37 మందికి 29 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన కావేరి 523 మార్కులతో టాపర్‌గా నిలిచింది. కస్తూరిబా గురుకుల పాఠశాలలో 32 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన ఉమామహేశ్వరి 554 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. బాలుర గిరిజన గురుకుల పాఠశాలలో 35 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించగా 569 మార్కులతో రామచంద్రా నాయక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో 38 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించగా 504 మార్కులతో గౌరిబాయి ప్రథమ స్థానంలో నిలిచింది. వై.చర్లోపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 17 మందికి 11 మంది ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన భవ్యశ్రీ 562 మార్కులతో టాపర్‌గా నిలిచింది. రామచంద్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 59 మందికి 53 మంది ఉత్తీర్ణత సాధించగా పాఠశాలకు చెందిన పెద్ద కాశమ్మ 572 మార్కులతో టాపర్‌గా నిలిచింది. మల్లికార్జునపురం మోడల్ పాఠశాలలో 76 మందికి 71 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన భార్గవి 572 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. చింతల ఆశ్రమ పాఠశాలలో 9 మందికి ఆరుగురు ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన చిన్న బయ్యన్న 386 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. రవీంద్ర హైస్కూల్లో 60 మంది హాజరుకాగా 59 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థి సంజయ్ 583 మార్కులు సాధించాడు. ఇండియన్ హైస్కూల్లో 31 విద్యార్థులకు 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా పాఠశాల విద్యార్థి శివ ఇందు 577 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఉత్తమ ఫలితాల సాధించిన విద్యార్థులను ఎంఈఓ మస్తాన్‌నాయక్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందలతో ముంచెత్తారు.

**తాళ్లూరు:** పది ఫలితాల్లో మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు మండల విద్యాశాఖ అధికారులు సుబ్బయ్య, సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలో మొత్తం 686 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 514 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో బొద్దికూరపాడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్.శ్యాంశివ విష్ణువర్ధన్‌డ్డి 570 మార్కులు సాధించి ప్రథమ స్థానం, నాగంబొట్లపాలెం ప్రభుత్వ పాఠశాలకు చెందిన కోమలి 557 ద్వితీయ స్థానం, తూర్పు గంగవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి షేక్ జహంగీర్ పాషా 554 తృతీయ స్థానంలో నిలిచారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

**దొనకొండ:** స్థానిక కేజీబీవీ పాఠశాలకు చెందిన పత్తి భవాని పది ఫలితాల్లో 573 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మల్లంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. విశ్వభారతి పబ్లిక్ స్కూల్లో 592 సాధించి నలదిమ్ము వెంకట సుబ్బారెడ్డి టాపర్‌గా నిలిచారు. మిగిలిన పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువ. చాలా మంది విద్యార్థులు లెక్కల్లో ఫెయిలైనట్లు ఉపాధ్యాయులు చెప్తున్నారు.

**త్రిపురాంతకం:** పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులతో గణపవరం ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ముందు వరుసలో ఉత్తీర్ణత చెందారని ప్రిన్సిపాల్ గంటా మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. బేతం వెంకటేశ్వర్లు 592 మార్కులు, పుచ్చకాయల నవీన్ 590 మార్కులు, పులిమి మర్షవర్ధన్ 589 మార్కులు సాధించారని తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి ఆర్.పవన యజ్ఞశ్రీ 588 మార్కులు, దుపాడు జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి ఎ.రాగచంద్రిక 567 మార్కులు, ఏపీఎస్ డబ్ల్యూ విద్యార్థి చిలక పల్లవి 557 మార్కులు, మేడపి జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి బందెల శ్రావ్య 557 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు చెప్పారు.

**యర్రగొండపాలెం:** పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు తమ సత్తా చాటారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన బి.గాయత్రి సింగ్ 582 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. పాఠశాలలో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 15 మంది ఉన్నారని హెచ్‌ఎం రమాదేవి తెలిపారు. మండలంలో ఉన్న 12 ఉన్నత పాఠశాలల్లో 897 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాశారు. వారిలో 596 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తమ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మంచి మార్కులతో విజయం సాధించారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.కల్పన 564 మార్కులు, కొలుకుల పాఠశాలకు చెందిన కె.లక్ష్మీతిరుపతమ్మ 521 మార్కులు, అమానిగుడిపాడు పాఠశాలకు చెందిన పి.ధనలక్ష్మి 487, బోయపల్లి పాఠశాలకు చెందిన వీవీ తిరివేణి 537, వీరభద్రాపురం పాఠశాలకు చెందిన జి.శరణ్య 526, గంజివారి పాఠశాలకు చెందిన జి.ఎలిజెబత్‌రాణి 498, మురారిపల్లె పాఠశాలకు చెందిన నాగాన్‌జిరెడ్డి 513, స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలకు చెందిన బి.అఖిల్‌నాయక్ 496, పీటీజీ బాలుర పాఠశాలకు చెందిన పోతురాజు 386, ఎంజేపీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలకు చెందిన డి.నాగూర్‌వలి 557 మార్కులు, కేజీబీవీ పాఠశాలకు చెందిన డి.మల్లేశ్వరి 512 మార్కులు సాధించి ఆయా పాఠశాలల్లో టాపర్స్‌గా నిలిచారు.

**ముండ్లమూరు (కురిచేడు):** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నిలిచింది. బి.కీర్తన, పి.అశ్వనిలు 583 మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు. ద్వితీయ ర్యాంకులో అదే పాఠశాలకు చెందిన కె.బాలకృష్ణ, జి.గాయత్రిలు 580 మార్కులు సాధించి ద్వితీయ ర్యాంకును కైవసం చేసుకున్నారు. మండలంలో మొత్తం 8 ప్రభుత్వ పాఠశాలలుండగా ఆదర్శ పాఠశాల, వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ఆదర్శంగా నిలవగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 77 శాతం ఉత్తీర్ణత సాధించి చివరి స్థానంలో నిలిచింది.

**దర్శి (కురిచేడు):** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా ఆదర్శ పాఠశాల విద్యార్థులు నిలిచారు. దారం రాఘవేంద్ర రెడ్డి 586 మార్కులు, పోతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సానె గురుప్రసన్న 586 మార్కులు సాధించి మొదటి ర్యాంకు నిలిచారు. దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అభిషేక్ 584 మార్కులు సాధించి మండల ద్వితీయ ర్యాంకులో నిలిచాడు. కందెల షాలిని 583, గోళ్లపాటి లీసా ప్రజ్వలిత 574, వరపర్తి హారిక 572 మార్కులతో పాటు 20 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ హసీనా, ఉపాధ్యాయులు అభినందించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 94 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. రాజంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 44 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో చివరి స్థానంలో నిలిచింది.

**పెద్దారవీడు:** మండలంలో కేజీబీవీ, 10 జెడ్పీహెచ్ పాఠశాలల్లో మొత్తం 553 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 501 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని ఎంఈఓ పి.శ్రీనివాసులు బుధవారం తెలిపారు. దేవరాజుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.పూజిత 579 మార్కులతో మండల స్థాయిలో మొదటి స్థానం, ఓబులక్కపల్లి జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి షేక్ అఫ్రున్య 574, సానికవరం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి టి.నర్మదా 574 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు. పాఠశాలల వారీగా బి.చెర్లోపల్లిలో 16 మందిలో 14 మంది, దేవరాజుగట్టులో 21 మందిలో 20 మంది గొబ్బూరులో 35 మందిలో 29 మంది, కలనూతలలో 24 మందిలో 22 మంది, మద్దలకట్టలో 37 మందిలో 36 మంది, ఓబులక్కపల్లిలో 98 మందిలో 96 మంది, పెద్దారవీడులో 64 మందిలో 51 మంది, సానికవరంలో 78 మందిలో 77 మంది, సుంకేసులలో 51 మందిలో 36 మంది, ఏనుగులదిన్నెపాడులో 94 మందిలో 91 మంది, కేజీబీవీలో 35 మందిలో 29 మంది బాల బాలికలు పాసైనట్లు వివరించారు. మండల స్థాయిలో మొదటి, రెండో స్థానంలో పాసైన విద్యార్థులను ఎంఈఓ పి. శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సన్మానించారు.

**పుల్లలచెరువు:** పదో తరగతి ఫలితాల్లో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఇందిర తెలిపారు. మండల స్థాయిలో సిద్దార్థ పాఠశాలలో చదువుతున్న గాజుల ఆదిలక్ష్మి 592 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా రెండో స్థానంలో భార్గవ్‌కు 591, శివమణి 590 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు. పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో చదువుతున్న కృష్ణంశెట్టి గీతానాగేశ్వరి 576 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. పసుపులేటు భవానీ 569 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు. మొత్తం మండలంలో 398 మంది పరీక్షకు హాజరుకాగా 98 మంది ఫెయిలైనట్లు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

**కురిచేడు:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో వరుసగా మూడోసారి మండలంలోని బోధనంపాడు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మండల టాపర్‌గా నిలిచారు. ఈ ఏడాది వేమా అశ్విని 582 మార్కులతో మొదటి స్థానం సాధించి పాఠశాలకు, సిబ్బందికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టింది. పయ్యావుల అమూల్య 559, పాతర్ల అమృత 558 మార్కులతో పాటు 10 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారు. మండల టాపర్, పాఠశాల ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఆనందోత్సాహాలతో వేడుకలు చేసుకుంటున్నారు. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలుండగా అత్యున్నతంగా కేజీబీవీ పాఠశాల 88.89 శాతం ఉత్తీర్ణత సాధించగా అత్యల్పంగా స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 56.63 శాతం ఉత్తీర్ణత సాధించింది.

## ఎమ్మెల్యే బూచేపల్లి ప్రత్యేక పూజలు


కెల్లంపల్లిలో అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ


మారెళ్లలో ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మను సత్కరిస్తున్న ఎంపీపీ దంపతులు

**ముండ్లమూరు (కురిచేడు):** మండలంలోని కెల్లంపల్లిలో అంకమ్మ తల్లి ఆలయ జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి నందినిలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మండలంలోని మారెళ్లలోని పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేయించారు. వారిని ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి దంపతులు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. అమ్మవార్ల చల్లని చూపులు ప్రజలపై ఉండాలని, ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెంది ప్రజలు సుభిక్షంగా ఉండాలని వారు అమ్మవార్లను వేడుకున్నారు. మండల పార్టీ కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, సూదిదేవర అంజయ్య, అప్పిరెడ్డి, బంకా నాగిరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మేడికొండ జయంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బూచేపల్లి ఆర్థిక సాయం

**తాళ్లూరు:** మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన యాతం సుబ్బారెడ్డి ఇటీవల విద్యుత్‌షాక్‌తో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం ఆయన్ను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బూచేపల్లి నాగిరెడ్డి కుమారుడు అంజిరెడ్డి వివాహానికి హాజరై పెళ్లి కుమారుడిని ఆశీర్వదించారు.


కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

## వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట


ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు


నాగశిలను ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

**పెద్దదోర్నాల:** మండల పరిధిలోని రామచంద్రకోటలో నూతనంగా నిర్మించనున్న వీర ప్రతాప ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన నూతన విగ్రహ, శిఖర, కలశ, ధ్వజ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నాభిశిలా శీతాలాంబ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలతో పాటు శ్రీ శీతాలాంబ, నాభిశిల, పోలేరమ్మ, అంకాలమ్మ, జంట నాగమయ్య, వీరబ్రహ్మేంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను బుధవారం గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామానికి సంబంధించిన బంధువులు కార్యక్రమానికి హాజరు కావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. శ్రీ విశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ తదియ శ్రవణ నక్షత్రయుక్త మకరలగ్న పుష్కరాంశంలో విగ్రహ ప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధాంతుల ఆధ్వర్యంలో ఉదయం కళాన్యాస హోమం, యంత్ర స్థాపన, శిలాస్థాపనస్నపన అలంకారం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు గ్రామ దేవత పోలేరమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## క్లుప్తంగా

### సబ్సిడీ పరికరాలు అందజేత


**దొనకొండ:** గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు బుధవారం అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్ 1, తైవాన్ స్ప్రేయర్లు 5, రోటావేటర్ 1, విత్తనం గొర్రు 1, ట్రాక్టర్ గొర్రులు 15 మొత్తం 23 మంది రైతులకు రూ.4.5 లక్షల సబ్సిడీ పరికరాలు అందజేశామన్నారు. పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు. వ్యవసాయ సిబ్బంది రవితేజ, కమల, విన్నిబాబు, అరుణ, రాధిక, రమేష్, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

### పహల్గావ్ ఘటనకు కొవ్వొత్తులతో నిరసన


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

**దర్శి (కురిచేడు):** కశ్మీర్‌లోని పహల్గావ్ సమీపంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా హిందువులు కొవ్వొత్తులతో బుధవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. కశ్మీర్ యాత్రకు వెళ్లిన అమాయకులైన హిందువులను కులాలు అడిగి మరీ హతమార్చటం కర్కశత్వమేకానీ మానవత్వం కాదని ఖండించారు. కశ్మీర్ యాత్రలో ఉగ్రవాదుల దాడిలో మృత్యువాత పడి అమరులైన వారి ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. స్థానిక ఆంజనేయ స్వామి గుడి నుంచి గడియార స్తంభం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలందరూ పాల్గొన్నారు.

### పాఠశాలకు జారుడు బల్ల ఏర్పాటు


జారుడు బల్లను ప్రారంభిస్తున్న దాత, ఎంఈవో

**యర్రగొండపాలెం:** మండలంలోని కొలుకుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన గర్రె బ్రహ్మయ్య బుధవారం జారుడు బల్లను ఏర్పాటు చేశారు. బల్లను ప్రారంభించిన ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరుపై దాదాపు రూ.40 వేల విలువ చేసే జారుడు బల్ల పాఠశాలలో ఏర్పాటు చేసి చిన్నారుల మానసిక ఉల్లాసానికి దోహదపడటం అభినందనీయమని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఇందిర, సీఆర్ ఎంటీ హనుమానాయక్, మూర్తి, దాత కుమారుడు శ్రీనివాసరావు భార్గవి పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### దర్శికి బయల్దేరిన దొనకొండ ముస్లింలు


ర్యాలీ చేస్తున్న తాళ్లూరు ముస్లింలు

**దొనకొండ:** సేవ్ వక్ఫ్..సేవ్ ఇండియా కార్యక్రమానికి దొనకొండ మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు వెయ్యి మంది ముస్లింలు బుధవారం దర్శికి ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. అన్ని మండలాల ముస్లింతో కలిసి దర్శి ర్యాలీలో పాల్గొన్నారు. నల్ల జెండాలు చేతబట్టి, నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ చట్టంలో ముస్లింలే ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నాన్ ముస్లింలు ఉండొచ్చని చేసిన సవరణ అక్రమమన్నారు. దీన్ని రద్దు చేసి పాత చట్టాన్నే అమలు చేయాలని ముస్లింలు నినాదాలు చేశారు.


దొనకొండలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

**తాళ్లూరు:** మండలంలోని అన్ని గ్రామాల ముస్లింలు బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తూర్పు గంగవరం–దర్శి ప్రధాన రహదారిలో బుధవారం శాంతియుత ర్యాలీ చేశారు. అనంతరం నియోజకవర్గ కేంద్రం దర్శిలో చేపట్టిన ర్యాలీకి హాజరయ్యారు. జాతీయ జెండాలతో, నల్ల జెండాలతో దాదాపు 300 మంది ర్యాలీగా వెళ్లినట్లు మండల ముస్లిం మత పెద్దలు తెలిపారు.

### విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

**పెద్దారవీడు:** విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పెద్దారవీడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జగదీష్ హెచ్చరించారు. మండలంలోని బద్వీడుచెర్లోపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, మధుమేహం వ్యాధిగ్రస్తుల రికార్డులు పరిశీలించారు. గర్భిణుల వివరాలు ఎంఎల్‌హెచ్‌పీ స్త్రైలీని అడిగి తెలుసుకొని తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మందిరంలో ప్రజలకు అందుబాటులో కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. గ్రామంలోని గర్భిణులను గుర్తించి పేరు నమోదు చేసుకొని ఎఫ్‌ఆర్‌ఎస్‌ను తగిన సమయంలో వేయాలని సూచించారు. క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి వారి శాంపిల్స్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని తెలియజేశారు. ఆయన వెంట హెల్త్ ఆఫీసర్ హరినాథ్, హెల్త్ సూపర్‌వైజర్ సుభాని ఉన్నారు.

### ఇంటర్‌లో చేరే విద్యార్థులకు ఆహ్వానం

**యర్రగొండపాలెం:** స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలుర)లో 2025–26 సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చేరే గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ బి.రవిబాబు బుధవారం తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, ప్రతి గ్రూపులో 40 మంది చొప్పున చేరే అవకాశం ఉందని తెలిపారు. ఆయా గ్రూపుల్లో చేరే ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన గిరిజన విద్యార్థులు మే 7వ తేదీలోపు తమ దరఖాస్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ముందుగా చెంచు విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని, మిగిలిన ఖాళీలను జనరల్ ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 91103 05571, 94414 09877, 81848 52327 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

### ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**దర్శి (కురిచేడు):** ముండ్లమూరు మండలం ఉల్లగల్లు వద్ద బుధవారం జరిగిన ఆటో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి గాయపడిన క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన 17 మంది కూలీలు వ్యవసాయ పనులకు ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి బండి శారమ్మ అనే మహిళ మృతి చెందటంతో పాటు పది మందికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితులను స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద సీపీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతి చెందిన శారమ్మ కుటుంబం పరిస్థితి కడు దయనీయంగా ఉందన్నారు. మృతురాలి భర్తకు 3 సంవత్సరాల క్రితం యాక్సిడెంటై కదలలేని పరిస్థితుల్లో ఉండటంతో కుటుంబ భారం మొత్తం మోస్తున్న శారమ్మ మృత్యువాత పడటంతో ఆ కుటుంబం ఆధారం కోల్పోయిందన్నారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని, పని ప్రదేశాలకు కలీలకు తగిన ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు, మండల కన్వీనర్ సందు వెంకటేశ్వరరావు, నాయకులు కేవీ పిచ్చయ్య ఉన్నారు.

### చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు ప్రభుత్వం సహకరించాలి


పోస్టుకార్డు ఉద్యమంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

**పుల్లలచెరువు:** పుల్లలచెరువులో ఉన్న చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని తీగలేరు సాధన సమితి కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఉద్యమ వక్తలు మాట్లాడుతూ పుల్లలచెరువు మండలం తీవ్ర కరువు పరిస్థితుల్లో ఉందని, తాగు, సాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెలుగొండ ప్రాజెక్టు నుంచి వచ్చే టీ5 కాలువను పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించే విధంగా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోస్టుకార్డుల ద్వారా ప్రభుత్వానికి చేరే విధంగా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి ఈ టీ5 కాలువను సాధించే వరకు ప్రతి ఒక్కరూ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్షుడు రఘు, సభ్యులు కోటిరెడ్డి, శివారెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, భారీ ఎత్తున రైతులు పాల్గొన్నారు.

### నేడు శిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

**పెద్దారవీడు:** మండలంలోని చట్లమిట్ల శిరిడీ సాయిబాబా మందిరంలో 17వ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమై ప్రాతఃకాల పూజలు, పుణ్యాహవాచనం, ప్రధాన కలశ స్థాపన, శ్రీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు, జప హోమాదులు, క్షీరాభిషేకం, సహస్రనామ పుష్పార్చనలు, మంత్ర పుష్పం, సాయంత్రం సాంచకాల పూజలు, జపాదులు, స్వస్తి, హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజలు నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానం, గ్రామంలో 5 గంటల నుంచి పల్లకిలో సాయిబాబా విగ్రహంతో గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు. భక్తులు విరివిగా విచ్చేసి సాయిబాబా వారి తీర్థప్రసాదాలు స్వీకరించి బాబా కృపకు పాత్రులు కాగలరని కోరారు.